## మంచి వారికి భగవాన్ ఆశీస్సులు ఎపుడూ ఉంటాయి : వెంకయ్య నాయుడు

**పంజగుట్ట, సెప్టెంబర్ 12 (ప్రభాతవార్త):** మంచి పనులు చేసేవారికి భగవంతుని ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. గురువారం ఖైరతాబాద్ మహా వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సత్యం ధర్మం వైపు నిలబడాలన్నారు. శంకరయ్య ప్రారంభించిన ఈ గణేష్ సంబరాలు వారి కుటుంబ సభ్యులు ముందుకు తీసుకువెళ్ళడం సంతోషమన్నారు. కలియుగంలో ముఖ్యంగా దేశంలో ప్రకృతి వైపరిత్యాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలకు సేవాభావాన్ని అందరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. అందరూ సుఖ శాంతులతో ఉండాలని ఆయన గణేష్ మహారాజ్‌ను ప్రార్ధించినట్లు ఆయన తెలిపారు. వెంకయ్యనాయుడు బడా గణేష్‌ను సందర్శించుకున్న సందర్భంలో పూజారులు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు.





# హైదరాబాద్ వార్త

# ఆహార కల్తీ..రోగాలతో కుస్తీ

**హైదరాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త**

ఇటీవల ఇద్దరు మిత్రులు మేడిపల్లిలోని ఒక రెస్టారెంట్‌కు వెళ్లి చికెన్ కర్రీ, రొట్టెలు ఆర్డర్ చేశారు. కొద్దిపేసటి తర్వాత వెయిటర్ వాటిని తీసుకొచ్చాడు. అది తింటుంటే కుళ్లిన వాసన వచ్చింది. ఇందేంటని అడిగితే స్పందన లేదు. అధికారులకు ఫిర్యాదు చేద్దామంటే ఎవరికి చెప్పాలో అవగాహన బోర్డులు లేవు. తిని రోగాలు తెచ్చుకోవడం కంటే తినకుండా బిల్లు చెల్లించడం బెటర్ అని వచ్చేశారు. ఇది నగర శివారు ప్రాంతాల్లోనే కాదు..రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో పలు రెస్టారెంట్లలో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఇక నగర శివారు మున్సిపాలిటీలు బోడుప్పల్, దుండిగల్, ఫిర్జాదిగూడ తదితర ప్రాంతాల పరిధిలో తనిఖీలు చేసేవారే కనిపించడంలేదు.

నగరంలో ఆహార రంగం అతిపెద్దది. చిన్నవి పెద్దవి కలిసి సుమారు 25వేల వరకు ఉంటాయి. నగరంలో బిర్యానీ, మాంసాహారం ప్రపంచ వ్యాప్తంగా పేరు గాంచాయి. వేలాదిగా ఉన్న హోటళ్లలో రోజు లక్షలాది మంది భుజిస్తుంటారు. జిహెచ్ఎంసి పరిధిలోని 22 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు వారంలో 5 రోజులపాటైనా హోటళ్లు, మిఠాయి షాపులు, బేకరీలను తనిఖీలు చేసి ఆహార నాణ్యత పరిశీలించాల్సి ఉంటుంది. కానీ వారు కార్యాలయాల నుంచి కదలడం లేదన్న ఫిర్యాదులున్నాయి. తనిఖీలు లేకపోవడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో జరిగిన తనిఖీ సమయంలో కుళ్లిన ఆహార పదార్థాలు, లేబుల్ లేని తినుబండారాలు తయారు ప్రదేశాలను గుర్తించి తనిఖీచేపట్టారు. కుళ్లిన ఆహార పదార్థాలతోపాటు తయారు చేసే ప్రదేశం అధ్వాన్నంగా ఉండడం చూసి నివ్వెరపోయారు. మారుతున్న జీవన శైలిలో భాగంగా తినే ఆహారంలో అనేక మార్పులొచ్చాయి. భుజించే ఆహారంలో కల్తీ పెరుగుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

### అడ్డుకునే వారు లేదు..

నగరంలో ఆహార కల్తీ ఆందోళన కలిగిస్తోంది. జిహెచ్ఎంసి ఆరోగ్య విభాగం మామూళ్ల మత్తులో మునిగిపోవడంతో చివరకు చిన్నారులు తాగే పాలు, తినే చాక్లెట్ల నుంచి ఆహార పదార్థాల వరకు కల్తీ అధికమైంది. చాలా హోటళ్లలో కుళ్లిన మాంసం, పాడైన వస్తువులతో వండి వారుస్తున్నారు. తనిఖీలు లేకపోవడంతో లక్షలాది మంది నాణ్యత లేని ఆహారాన్నే తినాల్సి వస్తోంది. బల్దియా పరిధిలో సుమారు 22 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నా చాలా మంది ప్రధాన కార్యాలయాన్ని వదిలి క్షేత్రస్థాయికి రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. చిన్న హోటల్ నుంచి మొదలుకొని రెస్టారెంట్ల వరకు ఆహారం కల్తీ జరుగుతుంది. వంటల్లో నాణ్యమైనా మంచి నూనె వాడడం లేదు. కొన్నిసార్లు వాడిన నూనెను పదేపదే వాడడంతో విష పదార్థాలు తయారవుతున్నాయి. తాజా కూరగాయలతో వంటలు చేయకపోవడం, బిర్యానీల్లో ఆకర్షించేలా రంగులను వాడుతున్నారు. నూడుల్స్ రుచిగా ఉండేలా కొన్ని పదార్థాలు కలుపుతుంటారు. ప్రతి ఆహార పదార్థాల్లో కల్తీ చేసి విక్రయిస్తుంటారు. జాగ్రత్తగా గమనించి కొనుగోలు చేయాలి. క్షేత్రస్థాయిలో నాసిరకం పదార్థాలు విక్రయిస్తున్నా పరిశీలించాల్సిన అధికారులు కానరావడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి వస్తువుపై లేబుల్ ఉంచాలి. తయారీ తేదీ, అందులో కలిపే వస్తువులు, గడువు వివరాలు ఉండాలి. మార్కెట్లలో పలు రకాల అప్పాలు, పచ్చళ్లు, చిప్స్, కారం, బందో, పాపుడాలు, అప్పడాలు, పచ్చళ్లు, చిన్న పిల్లలు తినే ప్యాకెట్లు అనుమతులు లేకుండానే తయారు చేస్తున్నారు. శివారు ప్రాంత జిల్లాల వారీగా ఆహార కల్తీ నిరోధక శాఖలను ఏర్పాటు చేశారు. జిల్లాకు ఒక గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించారు. అధికారులు ఆహార భద్రత, పరిరక్షణ, ప్రమాణాలను పర్యవేక్షించాలి. వీరికి సహాయకులుగా జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు ఆఫీస్ సబార్డినేటర్లను నియమించారు. అయినా వీరి పర్యవేక్షణ, తనిఖీలు, కేసుల నమోదులు కనిపించడంలేదు.

### వ్యాధులకు మూలం...

నాణ్యతను అసలు పట్టించుకోవడం లేదు. మాంసాహార వంటకాలకు రంగు తెప్పించేందుకు నిషేధిత టర్‌ట్రాజైన్ అనే సింథటిక్ రసాయనాన్ని కలుపుతున్నారు. అలాగే యూరియాతో పాలు తయారు చేస్తున్న వైనం వెలుగులోకి వచ్చాయి. అయినా నగర ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దీన్ని పరిగణనలోకి తీసుకోలేదు. మిఠాయిల్లోనూ నాణ్యత ఉండడంలేదని గతంలో ఫిర్యాదులు, తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. నాసిరకం వంట నూనెలు తయారవుతున్నాయి. అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారి వెలుగులోకి వచ్చినా పూర్తిగా నియంత్రించలేకపోతున్నారు. జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు కనీస సమీక్ష చేయడం లేదు.

బయటి ఆహారం తినడంలో చాలా రోగాలు వచ్చే అవకాశముంది. వీలైనంత వరకు తగ్గించుకుంటే మంచిది. ప్రస్తుతం చాలా మంది ఆర్డర్ పెట్టి ఫుడ్ ఇంటికి తెప్పించుకుంటున్నారు. వారు ప్రమాదకరమైన కవర్లలో ప్యాకింగ్ చేస్తున్నారు. మంచి నూనె వాడకపోవడం, వాడినా నూనెనే మళ్లీ వాడడంతో కడుపు నొప్పి వాంతులు, విరేచనాలు, బరువు పెరగడం, అజీర్ణం, బీపీ, మధుమేహం, శరీరంలో రోగనిరోధకశక్తి తగ్గిపోవిడం, కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయి. తర్వాత అది పచ్చకామెర్లకు దారి తీసి క్యాన్సర్ కూడా రావచ్చు. కవర్లలో టీ, కూరలు, బిర్యానీ పార్సిల్ తీసుకుపోతుంటారు. ఇది అత్యంత ప్రమాదకరం. క్యాన్సర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని వైద్యులు, ముందుగా అనారోగ్య సమస్యలు తప్పవని పేర్కొంటున్నారు.

## శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారిని దర్శించుకున్న బండి సంజయ్



మహాకాళీ అమ్మ వారి ఆలయంలో పూజలు చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్.

**బేగంపేట సెప్టెంబరు 12, ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయాన్ని గురువారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దర్శించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ అమ్మ వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్‌రెడ్డి, వేద పండితులు వేణు మాధవశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు రామతీర్థశర్మ తదితరులు ఆలయ సంప్రదాయాల ప్రకారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు స్వాగతం పలికి పూజలు నిర్వహింపజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మర్రిశశిధరరెడ్డి, కృష్ణయాదవ్, మహంకాళీ జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యాంసుందర్ గౌడ్, గౌతమ్‌రావు, సురేందర్‌రెడ్డి, కార్పోరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్, నాయకులు చీరె సత్యనారాయణ (శ్రీకాంత్), మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, చంద్రారెడ్డి, సీనియర్ బీజేపీ నాయకులు నెమలి ఆనంద్ (నందూ) తదితరులు పాల్గొన్నారు.

### బిజెపితోనే విశ్వగురువుగా భారత్ : కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

**ఎల్‌బినగర్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** విశ్వగురువుగా భారత్ మారాలన్నా, వికసిత భారత్ సాకారం కావాలన్నా భారతీయ జనతాపార్టీతోనే సాధ్యమవుతుందని కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. నాగోలు చౌరస్తాలో జరిగిన బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేని పాలన అందిస్తూ అభివృద్ధికి కొత్త నిర్వచనం ఇస్తున్న బిజెపికి మరింత బలన్ని ఇచ్చేందుకు బిజెపి సభ్యత్వ నమోదును ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరి అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేసే బిజెపికి అండగా నిలిచేందుకు బిజెపి సభ్యత్వాన్ని తీసుకుని తమ మద్దతును తెలియజేయాలన్నారు. సబ్‌కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ అనే నినాదంతో దేశాన్ని అగ్రగామిగా నిలుపుతున్న ప్రధాని మోది చేపట్టిన వికసిత భారత్‌లో భాగం కావడానికి ఇది మంచి అవకాశమని అందరు గుర్తించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పాల్గొన్నారు.

## స్టాండింగ్ కమిటీ సమావేశంలో 14 అంశాలకు ఆమోదం

### -జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ





స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, కమిషనర్ ఆమ్రపాలి తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి 5వ స్టాండింగ్ కమిటీ సమావేశంలో 14 అంశాలకు కమిటీ ఆమోదం జరిగినట్లు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ తెలిపారు. ఈమేరకు గురువారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో కమిషనర్ ఆమ్రపాలితోపాటు వివిధ పార్టీలకు చెందిన స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ మాట్లాడుతూ సిఎస్ఆర్ పద్ధతిలో చెరువుల అభివృద్ధికి ,చెరువలలో దోమల నివారణకు డ్రోన్‌ల ద్వారా స్ప్రే చేసేందుకు ముందుకే వచ్చే వారిని గుర్తించాలని అధికారులకు సూచించారు.

**స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందిన అంశాలు..**

- కెబిఆర్ పార్కు ఎంట్రీ వన్‌గేట్ వద్ద మల్టీలెవల్ స్మార్ట్ కార్ అండ్ మోటార్ సైకిల్ పార్కింగ్ అభివృద్ధి, నిర్వాహణకోసం 10సంవత్సరాల కు హైఎస్ట్ బిడ్డర్ అయని నవనిర్మాణ్‌సంస్థకు లెటర్ ఆప్ అవార్డు ఇచ్చేందుకు సంబంధించిన రాటిఫికేషన్ కొరకు కమిషనర్‌కి రికమండ్ చేస్తూ ఆమోదం.
- జిహెచ్ఎంసిలో పనిచేస్తున్న 90మంది కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్ల పేస్కేల్‌ను ప్రభుత్వ ఉత్తర్వు 827 ఎంఎయూడి ప్రకారంగా జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ రూ.24,280 నుంచి 72,850కు పెంచుతూ అట్టిమొత్తాన్ని 1.4.2023 నుంచి వర్తింపుకు ప్రతిపాదనలను కమిటీ ఆమోదించింది.
- బండ్లగూడ జంక్షన్ నుంచి ఎర్రకుంట జంక్షన్ వరకు 100అడగుల రహదారి విస్తరణ అభివృద్ధికి ఎస్ఆర్‌డిపి కింద 20కోట్ల వ్యయంతో చేపట్టే రోడ్డుకి 44 ఆస్తుల సేకరణ కొరకు అడ్మినిస్ట్రేటివ్ మంజూరు, రాటిఫికేషన్ సిఫారస్‌కు ఆమోదం.
- షేక్‌పేట్ మండలవ వార్డు నెం.10 బంజారాహిల్స్ 14లో యాక్సెస్‌రోడ్ కేటాయింపుకు హైకోర్టు ఆదేశాల మేరకు డా.టి. సురేఖ ,ఎ.విజయలక్ష్మీ లకు చెందిన ప్లాటక్లకు 70.04 చదరపు గజాల స్థలానికి మార్కెట్ విలువ చదరపు గజానికి లక్ష రూపాయల చొప్పున చెల్లింపుకై ఎన్‌వోసి జారీకి ఆమోదం.
- శేరిలింగపల్లి మండలం హాఫీజ్‌పేట్‌లోని కైదమ్మకుంటను సిఎస్ఆర్ కింద పునరుద్దరించుటకు మల్లిగావద్ ఫౌండేషన్ వారితో ఆరునెలల కాలానికి జిహెచ్ఎంసి కమిషనర్ ఎంవోయుచేసేందుకు కమిటీ ఆమోదించింది.
- సికింద్రాబాద్ -సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ మధ్య బాక్స్ పుషింగ్ పద్దతిలో కొత్త వంతెన నిర్మాణానికి 19.74కోట్లకు పరిపాలన అనుమతి ,ప్రభుత్వానికి సిఫార్స్ చేస్తూ ఆమోదం తెలిపింది.
- .లోతుకుంట రైల్వే బ్రిడ్జి నుంచి అల్వాల్ ఆర్‌వోబి వరకు తెలుగు తల్లి విగ్రహం వద్ద జిహెచ్ఎంసి పరిధి వరకు 60మీటర్ల ప్రతిపాదిత రోడ్డు వెడల్పుకు ప్రభావితమయ్యే 107ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం.
- .శేరిలింగంపల్లి మండలం మజీద్‌మండ కుడికుంట నాలాకు 3.96కోట్ల అంచనా వ్యయంతో స్ట్రామ్ వాటర్ ఆర్‌సిసి బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి పరిపాలన అనుమతి. షార్ట్ టెండర్ పిలవడానికి కమిటీ ఆమోదం.
- .శేరిలింగంపల్లి జోన్ చందానగర్ సర్కిల్‌లో కెఎస్ఆర్ లేఅవుట్ వద్ద సిఎస్ఆర్ కింద 43,600 చదరపు అడుగులలో అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధి చేసేందుకు మేసర్స్ తువక్కం వెల్ఫేర్ అసోసియేషన్‌తో మూడు సంవత్సరాల కాలానికి జోనల్ కమిషనర్ ఎంవోయూ చేయుటకు కమిటీ ఆమోదం.
- శేరిలింగంపల్లి జోన్‌లో సిఎస్ఆర్ కింద వివిధ పార్కులల్లో ప్రతిపాదిత ఐదు లొకేషన్లలో ఇంజక్షన్ బోర్ వెల్ రీచార్జ్ నిర్మాణాలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, చేపట్టేందుకు మేసర్స్ వాటర్ ఏయిడ్ ఆర్గనైజేషన్‌తో జోనల్ కమిషనర్ ఎంవోయూ చేసేందుకు ఆమోదం.
- .బంజారాహిల్స్ ఎంబిటి నగర్‌లో ఏసిబి కార్యాలయం వెనకవైపు రూ.3.85కోట్ల అంచనా వ్యయంతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టేందుకు పరిపాలన అనుమతికి అమోదం.
- శేరింగంపల్లి మండలం , గోపన్‌పల్లి గ్రామంలో 500గజాల స్థలంలో పెంపుడు జంతువుల స్మశాన వాటిక నిర్మాణం, మూడు సంవత్సరాల పాటు నిర్వాహణను తమ సొంత నిధులతో చేపట్టుటకు మేసర్స్ రాగా ఫౌండేషన్ వారితో జోనల్ కమిషనర్ ఒప్పందం చేసేందుకు కమిటీ ఆమోదం.
- జూన్ 2024 నుంచి జూలై 2024 వరకు జిహెచ్ఎంసికి సంబంధించిన ఆదాయ , వ్యయాలకు ఆమోదం.
- వివిధ వాట్స్‌లల్లో 15,500 కొత్త ఎల్ఈడీ స్ట్రీట్‌లైట్లు కొనుగోలు చేసేందుకుం 2.98 కోట్ల కు పరిపాలన అనుమతి షార్ట్‌టెండర్ పలవడానికి కమిటీ మోదం తెలిపింది.

## కనీస సదుపాయాల కల్పనకు చర్యలు

### -కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

**హైదరాబాదు, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి జోన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కనీస సదుపాయాల కల్పనకు దష్టి సారించి ఈ దిశలో చర్యలు తీసుకుంటున్నట్లు జోనల్ కమీషనర్ అపూర్వ చౌహాన్ తెలిపారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం, కెపిహెచ్‌బి కాలనీ, అల్వాల్ సర్కిళ్లలోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత దీపాలు, పారిశుద్యం మెరుగుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో భవన నిర్మాణ అనుమతుల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిర్మాణ అనుమతుల విషయంలో నిబంధనలు అనుసరించిన నిర్మాణదారులు, బిల్లర్లకు సంబంధించిన పైళ్ళను క్లియరెన్స్ చేస్తున్నట్ల తెలిపారు. కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్‌తోపాటు, ఏసీపీలు కూడా ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించినట్లు జోనల్ కమీషనర్ తెలిపారు. ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి జోన్ అబివృద్ధికి ప్రజలు సహకరించాలని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ తెలిపారు. ప్రధానంగా బస్తీలు, కాలనీలతోపాటు మురికివాడల్లో ప్రత్యేక శ్రద్ద తీసుకుని చెత్తా, చెదారాలు పేరుకుపోకుండా చూడడంతోపాటు నివాస ప్రాంతాల్లో స్వచ్ఛ ఆటోల్లో చెత్త సేకరన ప్రతినిత్యం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల్ని ఆయా సర్కిళ్ళ డిప్యూటీ కమిషనర్లతోపాటు ఇంజనీరింగ్, పారిశుద్యం, రెవిన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులకు గాని తన దృష్టికి తీసుకువస్తే పరిస్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ప్రజల కష్టాలు, బాధలు తెలిసినవాడు కాళోజీ

### -తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. ఎన్.బాలాచారి



కళోజీ సాహిత్య పురస్కార గ్రహీతలతో బాలాచారి, బడేసాబ్, దైవజ్ఞశర్మ, రాధాకుసుమ, శ్రీనివాస్‌యాదవ్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :**

కవి అనేవాడికి పాండిత్యం తెలిస్తేనే చాలదని, ప్రజలు అనుభవిస్తున్న కష్టాలు, బాధలు, సమస్యలను తెలుసుకున్నవాడే నిజమైన కవి అని ఆకోవకు చెందినవాడే కాళోజీ నారాయణరావు ప్రజాకవి అయ్యాడని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. ఎన్.బాలాచారి అన్నారు. తెలంగాణ భాష యాసలకు జీవంపోసి ప్రజా ఉద్యమాలకు ఊపిరిలు ఊదిన మహనీయుడని స్తుతిస్తూ తెలంగాణ భాషా సాహిత్యానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగుభాషా చైతన్య సమితి, కుసుమ ధర్మన్న కళాపీఠం, గోల్కొండ సాహితీ కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాత్రి రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో మహాకవి కాళోజీ నారాయణరావు 100వ జయంతి సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఎన్.బాలాచారి విశిష్ట అతిథులు దైవజ్ఞశర్మ, నక్క శ్రీనివాస్‌యాదవ్, పి.బడేసాబ్, డా. రాధాకుసుమ, అంజనీకుమారి, సత్యనారాయణ తదితరులతో కలిసి సాహిత్యరంగంలో విశేష కృషిచేసిన రామకృష్ణ చంద్రమౌళి, నారాయణస్వామి, కనకయ్య మల్లముల లను ఘనంగా సత్కరించి కాళోజీ పురస్కారాలను ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. సభకు ముందు కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో డా. రాధా కుసుమ నిర్వహణలో జరిగిన కాళోజీ కవిసమ్మేళనం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకొంది.

## సీటు బెల్టు ధరించి నిమజ్జనానికి వినాయకుడు..!

### -కారులో సీటు బెల్టుపై పోలీసుల అవగాహన

**ఉప్పల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** ట్రాఫిక్ నిబంధనలు పాటించేందుకు రాచకొండ పోలీసులు విన్నూత్న ఆలోచనలు చేస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా సీటు బెల్టు ధరించిన వినాయకుడిని నిమజ్జనానికి తీసుకుని వచ్చి చెరువులో నిమజ్జనం చేశారు. ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడిని ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధవి తన కారులో నల్ల చెరువు వద్ద ఏర్పాటు చేసిన కొలను వద్దకు తీసుకుని వచ్చారు. సిఐ మాధవి సీటు బెల్టు ధరించడంతోపాటు, వినాయకుడికి కూడా బెల్టు పెట్టడం గమన్హారం. అంతటి గణపయ్య రక్షణ కోసం సీటు బెల్టు ధరించినప్పుడు మనమెందుకు ధరించవద్దని పోలీసులు ట్వీట్ చేశారు. ప్రజ లకు అవగాహన కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు పేర్కొంటున్నారు.



కారులో సీటు బెల్టు ధరించి నిమజ్జనానికి తీసుకుని వస్తున్న ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధవి తదితరులు

## వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

### -సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింహ్మా డిమాండ్





వై జంక్షన్‌లో జరిగిన ప్రదర్శనలో మాట్లాడుతున్న ఇ.టి.నర్సింహ్మా

**సైఫాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** తెలంగాణ వరదల వైపరిత్యాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి తక్షణమే కేంద్ర ప్రభుత్వం 2 వేల కోట్ల రూపాయలు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ్మా డిమాండ్ చేశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన వినాశకరమైన వరదల వల్ల లక్షలాది మంది ప్రజల జీవితాలు, జీవనోపాధి, భవిష్యత్తు ప్రమాదంలో పడిందని, కేంద్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరిని విడనాడి వరద బాధితులను అదుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు గురువారం హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్‌లో ఆనేక మంది సిపిఐ కార్యకర్తలు వరదల వైపరిత్యాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి, తక్షణమే అదుకునేందుకు 2 వేల కోట్లు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇ.టి.నర్సింహ్మా మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చిన వరదల వల్ల ప్రజా మౌలిక వసతులు దెబ్బతినడమే కాకుండా వేలాది మంది జీవితాలు అతులాకుతలం అయినాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది చనిపోవడం జరిగిందని, లక్షలాది మంది నిర్వాసితులైనారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులతోసహా ఆనేక మంది నిరాశ్రయులైనారని, అపారమైన నష్టానికి గురైనారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బిజెపియేతర రాష్ట్రాల పట్ల వివక్ష చూపితే ఊరుకునేది లేదని, తక్షణమే వరదలను జాతీయ విపత్తుగా ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ఏర్పడిన సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం అన్ని విధాల సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమతం యాదగిరి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లై ఓవర్ పై డివైడర్‌కు డిసిఎం ఢీ

**బేగంపేట సెప్టెంబరు 12, ప్రభాతవార్త**

రోడ్డుపై ప్రయాణిస్తున్న డీసీఎం వాహనం అదుపు తప్పి బేగంపేట ఫ్లై ఓవర్ పైన రోడ్డు మధ్యలోని డివైడర్ ని బలంగా ఢీకొట్టిన ఘటన గురువారం తెల్లవారు ఝామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగక పోవడంతో పాటు పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. డీసీఎం వాహనం రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో డీసీఎం చక్రాలు ఊడిపోయాయి. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను ఎస్సై ఆర్ జయచందర్ తెలియజేసారు. సరుకుల లోడుతో బేగంపేట నుంచి పంజాగుట్ట వైపు వెళుతున్న డీసీఎం వాహనం ఏపీ 28 టీ ఈ 3702 గురువారం తెల్లవారు ఝామున గం 4.30ల సమయంలో బేగంపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైకి చేరుకోగానే మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో ఛాసిస్ విరిగిపోయి ముందు రెండు టైర్లు ఊడిపోయాయి. బ్రిడ్జి మధ్యలో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన మ్యానిక్యాన్ (ట్రాఫిక్ పోలీస్ బొమ్మ)కూడా విరిగి పోయింది. తెల్లవారు ఝామున ప్రమాదం జరగడంతో ఆ సమయంలో వెనుక ముందు పెద్దగా వాహనాలు ఏమి రాకపోవడంతో ప్రమాదం తప్పింది. వాహనంలో ఉన్న డ్రైవర్‌తో పాటు మరొకరికి కూడా ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదం తో బేగంపేట నుంచి గ్రీన్ ల్యాండ్స్ వచ్చే వాహనాలు నిల్చిపోవడంతో కొద్ది సేపు ట్రాఫిక్ కు స్తంభించింది. ట్రాఫిక్ పోలీసులు ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకుని డీసీఎం ను క్రేన్ సాయంతో అక్కడి నుంచి తరలించారు. ప్రమాదంపై బేగంపేట పోలీసులకు ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేసారు. దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జయచందర్ తెలిపారు.





అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొని రోడ్డుపై నిల్చిపోయిన డీసీఎం వాహనం

## రాహుల్‌గాంధీ హిందూ వ్యతిరేకి : బిజెపి


రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బీజేపీ నేతలు

సికింద్రాబాద్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను సీతాఫల్ మండి చౌరస్తా వద్ద బీజేపీ నేతలు దగ్ధం చేశారు. హిందూ దేవతలపై, హిందూత్వంపై అవమానకర, అవహేలన చేసి అసభ్యకరంగా మాట్లాడారని ఆరోపిస్తూ ఆయన దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యాక్రమం జరిగింది. సికింద్రాబాద్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, వెంకటేష్‌గౌడ్, పోచయ్యయాదవ్, ప్రభుగుప్త, రాజేశ్వర్, హనుమంతు ముదిరాజ్, రాజేశ్వరీ ఇతర నేతలు పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు
### -తలసాని శ్రీనివాస్ యాదవ్


నల్లా కనెక్షన్ కోసం తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బోయిగూడ ప్రజలు

సికింద్రాబాద్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట డివిజన్‌లోని న్యూబోయిగూడలో గల శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయానికి వచ్చే భక్తులు నీటికోసం ఇబ్బందులు పడుతున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి విన్నవించారు. తక్షణమే నల్లా కనెక్షన్‌కు అవసరమైన ఏర్పాట్లు జరుపుతానని వారికి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు.

## అన్నదానం నిర్వహించిన తొలుపునూరి కృష్ణగౌడ్


అంబర్‌పేటలో యంగ్‌స్టార్ అసోసియేషన్ వినాయక మండపం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేత తొలుపునూరి కృష్ణగౌడ్

హైదరాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజకవర్గంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. వీధి వీధుల్లో గణపతి బప్ప మోరియా అంటూ నినాదాలు మారుమోగుతున్నాయి. ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ గురువారం పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యంగ్ స్టార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జగన్ తదితరులు పాల్గొన్నారు.

### అడ్డగుట్ట డివిజన్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి : మోహన్


డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డికి వినపతిపత్రం అందజేస్తున్న ఓబిసి కాంగ్రెస్ నేత

**అడ్డగుట్ట,సెప్టెంబర్12 ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్‌లోని నార్త్‌లాలాగూడ రైల్వే క్వార్టర్స్ ప్రాంతాల్లో రోడ్లు, వీధి దీపాలు, నాలా, డ్రైనేజీలు అస్తవ్యస్థంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఓబిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్,గ్రేటర్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్ యాదవ్, శశి, రాహుల్ పాల్గొన్నారు.

## శంభునాథ్ తుండియాకు ఘన స్వాగతం


శంభునాథ్ తుండియాను శాలువాతో సత్కరించిన బిజెపి శ్రేణులు

నిజాంపేట్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి శంభునాథ్ తుండియా తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం తెలంగాణకు వచ్చిన సందర్భంగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో వారికి బిజెపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసి నాగరాజు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంతోష్ కుమార్, ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు కొంకి రాము, జిల్లా బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## అశ్రిత హోం బాలికలకు దుస్తులు పంపిణీ


బాలికలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

చార్మినార్,సెప్టెంబరు 12 ప్రభాతవార్త : పాతబస్తీ దూద్‌బౌలి అశ్రిత్ హోంకు చెందిన బాలికలకు తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్ ఆధ్వర్యంలో వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సందర్భంగా బాలికలకు వస్త్రాలు పంపిణీ చేశామని తెలిపారు. సమితి ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఆమన తెలియజేశారు. పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు


బోయిన్‌పల్లిలో రాణా ప్రతాప్ యువసేన గణేష్ మండపంలోపూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, జంపనప్రతాప్ తదితరులు


లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు.


బోయిన్‌పల్లి చౌరస్తాలో రాణా ప్రతాప్ యువసేన ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేష్ మండపంలో పూజలు చేస్తున్న డిసిపి రష్మి పెరుమాల్, సిఐ లక్ష్మి నారాయణ రెడ్డి, జంపనప్రతాప్, నిర్వాహకులు రాము, టీంకూ గౌడ్, జంపన రవి తదితరులు


ఈస్ట్ మారేడ్‌పల్లిలో ప్రతిష్ఠించిన గణేష్ మండపంలో పూజలు చేస్తున్న మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు


మహా ఘననాధునికి పూజలు నిర్వహిస్తున్న ఆస్కాని మారుతి సాగర్ కుటుంబ సభ్యులు


గణపతి పూజల్లో పాల్గొన్న డాక్టర్ మల్లారెడ్డి


పూజల్లో పాల్గొన్న శేషుకుమారి


రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌తో అసోసియేషన్ సభ్యులు


చందానగర్‌లో వినాయక మండపంలో పూజలు నిర్వహిస్తున్న జగదీశ్వర్‌గౌడ్


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పవన్‌కుమార్ గౌడ్ తదితరులు


ఘాన్సీ బజార్ నవయువక్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడు


పూజలు చేసిన మాజీ కార్పొరేటర్ పి.మమతసంతోష్‌గుప్త


దుర్గా అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం


పూజలు నిర్వహిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్


యువజనకాంగ్రెస్ నేత అరవింద్‌కుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు జగదీశ్ బాబు

నగరంలోని పలు నియోజకవర్గలో, డివిజన్, మున్సిపల్‌లలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల దగ్గర ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అసోసియేషన్ సభ్యులు గణేశుడికి ఘనంగా పూజలు నిర్వహించారు.

# ఘనంగా గణేష్ ఉత్సవాలు

## పేదలకు వరం సిఎం సహాయ నిధి : ప్రకాశ్‌గౌడ్


కిస్మత్‌పూర్‌కు చెందిన మల్లేష్‌కు రూ.40.వేల సిఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

నార్సింగి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : నిరుపేదలు కార్పోరేట్ వైద్యం పొందేందుకు సిఎం సహాయ నిధి వరంగా మారిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లోని కిస్మత్‌పూర్‌కు చెందిన ఎంకిర్యాల మల్లేష్‌కు రూ.40.వేల సీఎం సహాయ నిధి చెక్కును ప్రకాశ్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పెద్ద రోగాలు వస్తే నిరుపేదలు ప్రాణాలపై ఆశలు వదిలేసుకునే వారని, ఇప్పుడు సీఎం సహాయ నిధి కారణంగా పెద్ద జబ్బులను పెద్ద ఆసు పత్రులకు వెళ్లి నయం చేసుకుంటున్నారని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యంను అందిం చేందుకు తెలంగాణ సర్కారు సీఎం సహాయ నిధిని మరింత పెంచడం శుభపరిణామ మన్నారు. పేదల పక్షపాతి అయిన సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం నిరుపేదల కష్టాలు దూరం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్మిక, కర్షక, పేద, బడుగు, బల హీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పతకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గోకరి సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ధాత్రి కాలనీ, ఇందిరమ్మ కాలనీ, శ్రీనివాస ఎన్‌క్లేవ్ కాలనీల్లో వరానసల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మత్తులను తన సొంత నిధులు వెచ్చిం చి కార్పోరేటర్ శ్రీలతగౌడ్ చేయించారు.

## పిసిసి అధ్యక్షుడికి శుభాకాంక్షల వెల్లువ


తెలంగాణ పిసిసి అధ్యక్షులు మహేష్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన గండిపేట మండల కాంగ్రెస్ నాయకులు.

నార్సింగి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : తెలంగాణ పిసిసి నూతన అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు గురువారం గండిపేట మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పుష్పగుచ్చాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మహేష్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని, అజేయ శక్తిగా ఎదుగుతుందని ముదిరాజ్ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టిపిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డిలు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశించే ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మావంతు శక్తించన లేకుండా పని చేస్తామన్నారు. ఆది నుంచి అణగారిన వర్గాలకు అండగా ఉండడం, అభివృద్ధి చేయడం కాంగ్రెస్ పార్టీకే చెల్లిందన్నారు. గత పదేళ్ల తెలంగాణలో పేద ప్రజలు సంక్షేమ ఫలాలకు దూరమయ్యారని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ సంక్షేమ పాలనను తీసుకు వస్తున్నారన్నారు. కార్మికులు, కర్షకులు, యువకులు, మహిళలు ఇలా అన్ని రంగాల ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ సర్కారు పని చేస్తుందని వివరించారు. పీసీసీ అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నేతలు క్యాతం అశోక్ యాదవ్, వేణుగౌడ్, కిరణ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఇరాక్ నుంచి ఇండియాకు తమ వారిని రప్పించాలి


ప్రజావాణిలో అధికారికి వినతి పత్రాన్ని అందిస్తున్న బాధితుల బంధువులు

సైఫాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త: ఇరాక్ దేశంలోని బస్రాలో గత నెలలుగా వేతనాలు చెల్లించకుండా కంపెనీ యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తున్నదని ముగ్గురు బాధితుల పక్షాన వారి కుటుంబ సభ్యులు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. వారితోపాటు టి-పిసిసి ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ యూకే ఉపాధ్యక్షుడు రంగుల సుధాకర్‌గౌడ్, ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం ప్రతినిధి మహ్మద్ బసీర్ పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం కొరండ్లపల్లికి చెందిన బట్టు హరీష్, నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం తల్వేదకు చెందిన ఒరికె నడిపి రాజన్న గత రెండేళ్లుగా ఇరాక్‌లోని బస్రా పట్టణంలో ఒక నిర్మాణ కంపెనీలో కూలీలుగా పనిచేస్తున్నారు. బాధితులు పంగ సత్తయ్య భార్య రమ, రాజన్న భార్య గంగలత, హరీష్ తల్లి సుగణ తదితరులు ప్రజావాణిలో ప్రత్యేక అధికారి దివ్యా దేవరాజన్‌ను కలిసి తమ గోడునున వెళ్లబోసుకున్నారు. నాలుగు నెలలుగా రావాల్సిన వేతనం బకాయిలు, ఇతర బెనిఫిట్స్ ఇప్పించి, ఆ ముగ్గురిని ఇరాక్ నుంచి ఇండియాకు తెప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తికి స్పందించిన దివ్యా దేవరాజన్ వెంటనే ఇరాక్‌లోని ఇండియన్ ఎంబాసి దృష్టికి తీసుకువెళ్ళారు.

## మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణస్వీకారానికి గౌడ్‌లంతా తరలిరావాలి

### -తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షులు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌గౌడ్, వెంకటనారాయణగౌడ్ తదితరులు

హైదరాబాద్, సెప్టెంబరు 12,ప్రభాతవార్త: గౌడసామాజిక వర్గానికి చెందిన మహేష్‌కుమార్‌గౌడ్‌కు టిపిసిసి ప్రెసిడెంట్‌గా బాధ్యతలను అప్పగించడం అభినందనీయమని తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షులు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ అన్నారు. ఈమేరకు గురువారం నెక్లెస్‌రోడ్ లోని నీరాకేఫ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15న టిపిసిసి ప్రెసిడెంట్‌గా మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణస్వీకారోత్సవానికి రాష్ట్రంలోని అన్నిజిల్లా, మండల కేంద్రాల నుంచి బిసి,గౌడ సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కులగణనతోపాటు బిసి రిజర్వేషన్ల పెంపుకు సానుకూలంగా ఉందన్నారు. అలాగే ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 150 సేఫ్టీ మోకులను అందించడాన్ని స్వాగతిస్తున్నామని కానీ వాటి సంఖ్యను మరింత పెంచాలన్నారు. ప్రస్తుతం వైన్‌షాప్‌లలో వాటా 15శాతం ఉండగా, కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 25శాతం వాటా కల్పించాలన్నారు. గతబిఆర్ఎస్ ప్రభుత్వ హయాంతో గౌడ్‌ల ఆత్మగౌరవ బవనం కోసం ఐదెకరాలు, ఐదుకోట్లు కేటాయించిందని ,అది పూర్తయ్యేందుకు ప్రభుత్వం తన వంతు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గోపగోని వెంకటనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి గుండ్ల ప్రశాంత్‌గౌడ్, ఉపాధ్యక్షులు ధనుంజయ్‌గౌడ్, గట్టు రమేష్‌గౌడ్, గ్రేటర్ అధ్యక్షులు దేవేందర్ గౌడ్, రంగారెడ్డి అధ్యక్షులు రవీందర్‌గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు అనురాధ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏచూరి మరణం ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటు

### టీఎస్‌యూటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి


సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నేతలు

**ముషీరాబాద్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** సీతారాం ఏచూరి మరణం ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటని టీఎస్ యూటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.జంగయ్య, చావ రవి అన్నారు. గురువారం దోమలగూడలోని యూటీఎఫ్ కార్యాలయంలో సీతారం ఏచూరి చిత్రపటానికి పూల మాల వేసి నివార్పించారు. ఈ సందర్భంగా వారు ఏచూరి మరణం పట్ల వారు తీవ్ర సంతాపం తెలియచేశారు. ఏచూరి సీతారాంతో విద్యా రంగానికి, ఉపాధ్యాయ ఉద్యమానికి విడదీయలేని అనుబంధం ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని యూటీఎఫ్, జాతీయ స్థాయిలో ఎస్టీఎఫ్ఐ నిర్వహించిన విద్యా సదస్సులు, మహాసభల్లో ఎస్ఎఫ్ఐ అధ్యక్షునిగా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యునిగా పాల్గొని, స్పూర్తిదాయకమైన ఉపన్యాసాలతో ఉపాధ్యాయులను ఉత్తేజపరిచేవారని గుర్తు చేసుకున్నారు. సీతారాం మరణం పట్ల యూటిఎఫ్ రాష్ట్ర కమిటీ పక్షాన ఘనంగా నివాళులర్పిస్తూ వారి కుటుంబానికి, సీపీఎం పార్టీకి సానుభూతి తెలియచేస్తున్నామన్నారు.

## ప్రభుత్వ మెడికల్ కాలేజ్ కుత్బుల్లాపూర్‌లోనే నిర్వహించాలి

కొంపల్లి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త: సీపీఐ చేసిన అనేక పోరాటల వల్ల మెడికల్ కాలేజ్‌ను కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేస్తున్నా మని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. కానీ ఇక్కడ మెడికల్ కాలేజ్ నిర్వహణ కోసం భవనం లేదని నేడు ఇతర ప్రాంతంలో మన పేరుతో నిర్వహించడం దురదృష్టకరమని, వెంటనే స్థానిక ఎమ్మెల్యే మెడికల్ కాలేజ్‌ని మన ప్రాంతంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్‌లోనే మెడికల్ కాలేజ్ సాధన కొరకు అన్ని రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించి పోరాటం కొనసాగిస్తామని అన్నారు. అధికారంలో ఉన్న నాయకులకు దూరదృష్టి లేకపోవడం వల్ల గతంలో జగద్గిరిగుట్టకు మంజూరు అయిన ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయం తరలిపోవడం, మళ్ళీ ఇప్పుడు మెడికల్ కాలేజ్ పోవడం జరిగిందని, ఇప్పటికైనా అధికారంలో ఉన్న పార్టీల నాయకులు ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యుడు హరనాథ్, ప్రజానాట్య మండలి జిల్లా, మండల అధ్యక్షుడు ప్రవీణ్, బాబు, కార్యదర్శి భాస్కర్, మండల కోశాధికారి సదానంద్, కార్యదర్శి సహదేవరెడ్డి, సీపీఐ నాయకులు దప్పు రామస్వామి, సామెల్, ఇమామ్, ప్రభాకర్, నర్సయ్యలు పాల్గొన్నారు.

## కౌశిక్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి

సైఫాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోటికి వచ్చినట్లుగా రాష్ట్ర శాసన సభ్యుడు అరికెపూడి గాంధీపైన, మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటం తగదని, తక్షణమే క్షమాపణ చెప్పాలని టి-పిసిసి ఓబిసి సేల్ ప్రధాన కార్యదర్శి గొంటి విక్రమ్‌యాదవ్ డిమాండ్ చేశారు. కౌసిక్‌రెడ్డి మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని మండిపడ్డారు. మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన కౌశిక్‌రెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అరికెపూడి గాంధీని స్థానికుడు కాదని విద్వేషాలను రెచ్చగోట్టడం తగదని, బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ పూర్వికులు బీహార్, విజయనగరం నుంచి వలస వచ్చి తెలంగాణకు ముఖ్యమంత్రి కాలేదా ?, మాటలు మాట్లేడేటప్పుడు నోరును అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. మహిళలను కించపరిచేలా, వారి శక్తి, సామార్థ్యాలను తక్కువ చేసేలా గాంధీ ఇంటికి చీరె, గాజులు పంపుతాననడం ఒక ప్రజా ప్రతినిధిగా మహిళలను అవమానించడమేనని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజాంను తరిమికొట్టిన చాకలి ఐలమ్మ వారసులు తెలంగాణ ఆడబిడ్డలన్న విషయాన్ని కౌశిక్‌రెడ్డి తెలుసుకోవాలని, తెలంగాణ చరిత్ర తెలవని కౌశిక్‌రెడ్డి, గాంధీని ఇంటికి రమ్మని ఇంట్లో కూర్చోని తొడగొట్టడం ఆయన పిరికితనానికి నిదర్శన మన్నారు. ఇప్పటికైనా కౌశిక్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెపుతారని ఆయన హెచ్చరించారు.

## లాడ్జ్‌పై నుంచి దూకి యువకుడి ఆత్మహత్య

చిక్కడపల్లి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త: ఓ యువకుడు ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో ఓ లాడ్జ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ గ్రామానికి చెందిన మాధవ్ కుమారుడు గజానంద్(24) గత కొన్ని రోజుల కింద హైదరాబాద్ నగరానికి ఏదైనా ఉద్యోగం చేయాలనే సంకల్పంతో వచ్చి ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ లాడ్జ్‌లో ఉద్యోగం సంపాదించాడు. బుధవారం లాడ్జ్‌పైకి ఎక్కిన గజానంద్ పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చిక్కడపల్లి పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహించిన పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

## ఆయుష్మాన్ భారత్‌కు బహుళ ప్రచారం కల్పించాలి

### తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

ముషీరాబాద్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త: ఆయుష్మాన్ భారత్ పథకంకు బహుళ ప్రచారం కల్పించి, ప్రజలందరికీ అవగాహన కల్పించాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కవాడిగూడలో విలేఖరులతో మాట్లాడుతూ 70 ఏళ్ల వయసు పై బడిన వారందరికీ ఆదాయ, సామాజిక స్థితిలతో సంబంధం లేకుండా ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా సంవత్సరానికి ఐదు లక్షల ఉచిత ఆరోగ్య భీమా వర్తింపచేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమని అన్నారు. ఈ పథకంతో దేశంలో వయోవృద్ధులు, అనాథలు, కుటుంబ నిరాదరణకు గురైన వారందరికే కాకుండా పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి కూడా ఎంతో ఉపశమనంగా ఉంటుందని తెలిపారు. ఇది చిరకాలం స్మరించుకునే పథకమని కొనియాడారు.

## నేడే పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస బలపరీక్ష

**హయత్‌నగర్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి సంబంధించి బలపరీక్షను శుక్రవారం నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొంది ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలోకి మారిన చైర్‌పర్సన్‌పై బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు సైతం అసంతృప్తితో ఉన్నారు. మొత్తం 24 మంది కౌన్సిలర్లలో 17 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాణాన్ని కలెక్టర్‌కు అందించారు. దీనిని పరిగణలోకి తీసుకున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఈనెల 13న అవిశ్వాస బలపరీక్ష కోసం తేదీని నిర్ణయిస్తూ సమావేశాన్ని ఏర్పాటుచేస్తూ కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్సీకి నోటీసులు పంపించారు. కాంగ్రెస్ పార్టీలోని వర్గపోరు కారణంగా చైర్‌పర్సన్ అవకాశాన్ని దక్కించుకున్న చెవుల స్వప్న ఆదినుంచి వివాదాస్పదంగానే వ్యవహరించడం అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ లోని ఒక వర్గానికి మింగుడుపడలేదు. చివరికి ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సైతం చైర్‌పర్సన్ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారితే తన పదవి పదిలంగా ఉంటుందని భావించినా… అవిశ్వాస ముప్పు తప్పలేదు. అవిశ్వాస తీర్మాణం అందించిన 17 మంది కౌన్సిలర్లతో పాటు మరికొందరు కూడా సమావేశానికి హాజరై అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేయనున్నట్లు సమాచారం. దీంతో ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రధాన అనుచరుడు పండుగుల జయశ్రీరాజును తదుపరి చైర్మన్‌గా ఎన్నుకునే అవకాశాలున్నాయి.

### ఉప్పల్‌లో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు



డ్రైనేజీ సమస్యపై జలమండలి ఎండితో చర్చిస్తున్న ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నేత ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారం లభించనుందని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రామంతాపూర్ భగాయత్ కాలనీవాసులతో కలిసి జలమండలి ఎండి అశోక్‌రెడ్డిని కలిసి పలు సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామంతాపూర్ భగాయత్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, రాంరెడ్డినగర్ నుంచి నల్ల చెరువు వరకు ట్రంక్ లైన్ సూపర్ సక్కర్‌తో శుభ్రం చేయాలని కోరారు. కాప్రా సర్కిల్‌లోని జవహర్‌నగర్ పరిధిలోని వచ్చే కాలనీల డ్రైనేజీ సమస్య పూర్తి స్థాయిలో పరిష్కరించాలని విన్నవించారు. దీనికి సంబంధించిన పనులకు ప్రతిపాదనలు సిద్దం చేయాలని అధికారులను ఎండి అశోక్‌రెడ్డి ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు వజ్రేష్‌యాదవ్, కార్పొరేటర్ స్వర్ణరాజ్, సీనియర్ నేతలు రఫీక్, తవిడబోయిన గిరిబాబు, శ్రీకాంత్‌యాదవ్, బాలకృష్ణనగర్ కాలనీ వాసులు నాగమల్లయ్య, వేణుగోపాలచారి, ఖాసీం, సైదయ్య, నరసింహ, రామకృష్ణారెడ్డి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

### మైనంపల్లి హన్మంతరావుతో ఉప్పల్ కాంగ్రెస్ నేతల బేటి



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మైనంపల్లి హన్మంతరావుతో బేటి అయిన ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నేతలు

**ఉప్పల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మైనంపల్లి హన్మంతరావుతో బేటి అయ్యారు. ఈ మేరకు పలువురు పార్టీ నేతలు మైనంపల్లిని కలిసి పలు సమస్యలు విన్నవించారు. ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమ వంతు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, పావనిరెడ్డి, తవిడబోయిన గిరిబాబు, రాఘవరెడ్డి, గరిక సుధాకర్, సుధాకర్‌శెట్టి, సంతోష్‌రెడ్డి, పబ్బు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### వినాయక మండపాల వద్ద ఉత్సవ సమితి నేతల పూజలు

**ఉప్పల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :**

ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పలు మండపాలను సందర్శించి పూజలు నిర్వహించారు. ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్, అధ్యక్షుడు జెట్ట కిషోర్, ఏమాండ్ల రాంరెడ్డి, సుక్క కిరణ్, లింగంపల్లి అనిల్, అలెగ్జాండర్, నవీన్‌చారి, యుగేందర్ తదితరులు వినాయక మండపాల వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా చేసుకోవాలని సూచించారు. ఉత్సవాలు విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉత్సవ సమితి నేతలు పాల్గొన్నారు.

### మండపాల వద్ద బిఆర్ఎస్, బిజెపి నేతల పూజలు



ఉప్పల్‌లో మండపాల వద్ద పూజలు నిర్వహిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి, డా.శిల్పారెడ్డి తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద గురువారం పలువురు పార్టీ నేతలు పూజలు నిర్వహించారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి, బిజెపి మహిళా అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, భాగ్యనగర్ ఉత్సవ సమితి ఇంచార్జీ రెవల్లి రాజు, అధ్యక్షుడు అరటికాయల వంశీ, బోరంపేట మురళీ, వెంకటేష్ తదితరులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ఆనందోత్సవాలతో చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

# నేడే మదర్‌డెయిరీ పాలకవర్గ సభ్యుల ఎన్నిక...

-క్యాంపు నుంచి నేరుగా వచ్చి పోలింగ్‌కు హాజరు కానున్న ఓటర్లు

-చైర్మన్ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు



హయత్‌నగర్‌లోని మదర్‌డెయిరీ 4

**హయత్‌నగర్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:**

నార్మాక్ మదర్‌డెయిరీలో 6 పాలకవర్గ స్థానాలకు సంబంధించి శుక్రవారం ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం 15 స్థానాలకు గాను గతేడాది 3 స్థానాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఈసారి 6 స్థానాలకు ఎన్నికలను నిర్వహించడానికి ఎన్నికల అధికారి నోటిఫికేషన్ జారీచేశారు. హయత్‌నగర్‌లోని ఎస్.వి. కన్వెన్షన్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నాం ఒంటి గంట వరకు పోలింగ్ కొనసాగనుంది. మధ్నాహ్నాం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల ఫలితాలను ప్రకటిస్థారు. ఈమేరకు ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. ఈనెల 4న నామినేషన్ల దాఖలుతో ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ శనివారం చైర్మన్ ఎన్నికతో ముగియనుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాకు సంబంధించి 4 జనరల్ స్థానాలకు 8 మంది బరిలో నిలవగా… ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి 2 జనరల్ స్థానాలకు నలుగురు బరిలో ఉన్నారు. 297 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

**చైర్మన్ పదవి ఎవరిని వరించేనో....**

పోలింగ్ ఇప్పటి వరకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన లింగాల శ్రీకర్‌రెడ్డి రెండేళ్లుగా చైర్మన్‌గా కొనసాగుతుండగా.. ఆయన పదవికాలం ఈనెలాఖరుతో ముగియనుంది. ఈనేపథ్యంలో నూతన చైర్మన్ ఎవరనేది ఆసక్తి కరంగా మారింది. బలాబలాలను పరిశీలిస్తే ప్రస్తుతం ఉన్న 9 మంది పాలకవర్గ సభ్యులలో ముగ్గురు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కాగా… ఆరుగురు బీఆర్ఎస్ మద్దతు దారులు ఉన్నారు. చైర్మన్ ఎన్నిక కోసం ఎనిమిది మంది సభ్యుల మద్దతు అవసరమైన నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి యత్నాలు కొనసాగిస్తున్నాయి. సొసైటీ చైర్మన్లకు(ఓటర్లు) డబ్బులు పంపిణీ చేయడంపై దృష్టిసారించాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య మద్దతుదారుడు గుడాపాటి మధుసూదన్‌రెడ్డిని చైర్మన్ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు సమాచారం. అయితే… ఇప్పటికే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి భరిలో ఉన్న నలుగురు కాంగ్రెస్ పార్టీ మద్దతు దారులు కాగా… ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి బరిలో ఉన్న నాలుగు స్థానాలను గెలుచుకోవడం ద్వారా చైర్మన్ పదవిని దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కృతనిశ్చయంతో ఉంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలు మదర్‌డెయిరీ చైర్మన్ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అయితే… ఇప్పటికే ఆరుగురు సభ్యులు ఉండగా… మరో రెండు స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా చైర్మన్ పదవిని తిరిగి దక్కించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఎత్తుగడ వేస్తోంది. చైర్మన్ పదవి కైవసం చేసుకోవడానికి సరిపడ సభ్యులు లేనిపక్షంలో అవసరమైతే బీఆర్ఎస్ పార్టీ సభ్యులను లాగేందుకు కాంగ్రెస్ యత్నిస్తోంది. ఇప్పటికే ఇద్దరు ముగ్గురు ప్రస్తుత సభ్యులు కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులతో మంతనాలు చేసినట్లు సమాచారం.

## మల్కాజిగిరి ప్రజలకు ఎమ్మెల్యే ఉచిత అంబులెన్స్ సదుపాయం



మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఉచిత అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు

**మల్కాజిగిరి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** మల్కాజిగిరి ప్రజలకు స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఉచితంగా ప్రవేశపెట్టిన ఉచిత అంబులెన్స్ వాహనాన్ని గురువారం కార్పొరేటర్లు మేకల సునీత రాముయాదవ్, కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్‌లు ప్రారంభిచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మల్కాజిగిరి పరిధిలోని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంబులెన్స్ సదుపాయం కల్పించారని తెలిపారు. దుండిడల్‌లో ఉన్న అరుంధతి ఆసుపత్రికి సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అక్కడికి వెళ్లి ఉచితంగా వైద్య సేవలు చేయించుకునేందుకు వీలు ఉంటుంన్నారు. స్థానికుల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి రావడంతో ఆయన స్పందించి ప్రత్యేకంగా అంబులెన్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. వారంలో నాలుగు రోజులు మల్కాజిగిరి నుంచి అరుంధతి ఆసుపత్రి వరకు అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని, రెండు రూట్లుగా రూట్ మ్యాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## నిరుద్యోగ మహిళలకు ఉద్యోగావకాశాలను కల్పించడానికి సబితారెడ్డి కృషి : పాలపర్తి విజయలక్ష్మి



మహిళల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి హాజరైన పాలపర్తి విజయలక్ష్మి తదితరులు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని నిరుద్యోగ మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి కృషి చేస్తున్నారని నియోజకవర్గ బీఆర్ఎస్ ఉపాధ్యక్షురాలు, మీర్‌పేట్ మాజీ ఎంపిటిసి పాలపర్తి విజయలక్ష్మి అన్నారు. కెసిఆర్ సిఎంగా ఉన్న సమయంలో నియోజకవర్గంలోని తుక్కుగూడ కొంగర కలాన్‌లో నిర్మాణమైన ఫాక్స్ కాన్ కంపెనీలో నిరుద్యోగ మహిళలకు ఉద్యోగాలను కల్పించే ఉద్దేశ్యంతో సబితారెడ్డి ప్రోద్భలంలో గురువారం జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలోనున్న శ్రీరస్తు శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్న 30 సంవత్సరాల లోపు మహిళలకు ఉద్యోగాలను కల్పించాలని సబితారెడ్డి చేసిన వినతికి ఫాక్స్ కాన్ కంపెనీ యాజమాన్యం స్పందించిందని తెలిపారు. నియోజకవర్గంలో ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న సబితారెడ్డి మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కూడా చేయూతనిస్తున్నారని ఆమె అన్నారు. ఈ మేరకు ఆమె మహిళల తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపా రు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిఆర్ఎస్ మహిళాధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీత, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ సిల్వేరి సాంబశివ, గడ్డమీది లక్ష్మణ్ ముదిరాజ్, మహేందర్, నిరుద్యోగ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి : ఏసిపి శ్యాంసుందర్

**మలక్ పేట ,సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :**

ఉత్సవాలు శాంతియుత వాతావరణం ప్రశాంతంగా జరుపుకోవాలని మలక్ పేట ఏసీబీ శ్యాంసుందర్ పేర్కొన్నారు. ఓల్డ్ మలక్ పేట మార్కెట్ వద్ద శ్రీ వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మలక్ పేట ఏసీపి శ్యామ్ సుందర్, చాదర్ ఘాట్ ఎస్ ఐ పర్వేజ్, మున్సిపల్ కమిషనర్ పిపి వెంకట రమణ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వాహకులు పిటి శంకర్ ముదిరాజ్, ఎం రామకృష్ణ, నర్సింహారెడ్డి, విక్రమ్, లక్ష్మీ నారాయణ, పి టి నరేంద్ర ముదిరాజ్, నర్సింగ్ రావు, వేణు, వినోద్, భరత్ తదితరులు పాల్గొన్నారు. పూజ అనంతరం జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

**హరిహార క్షేత్రంలో ...**

మలక్పేట పల్టన్ లోని శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి మహిళలు సుమారు పది లక్షల గరికలతో స్వామివారికి విశేష అర్చన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. అదేవిధంగా భారీ సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం చైర్మన్ సూగూరు రమేష్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను దేవాలయంలో నిర్వహిస్తున్నామన్నారు .ఈ కార్యక్రమంలో ఈవో మార్తాండ రావు, ఆలయ అర్చకులు కాసుల చంద్రశేఖర శర్మ, మంగళగిరి శ్రీనివాసాచార్యులు, సభ్యులు శెట్టి విజయకుమార్ ,వనం సత్తేందర్, రమేష్, రేణు అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఏసిపి శ్యాంసుందర్ పిటి శంకర్ ముదిరాజ్ తదితరులు



గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు

**దిల్ షుక్ నగర్ లో....**

దిల్ షుక్ నగర్ ఫ్రెండ్స్ అండ్ షాప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహానికి మూసారంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దిల్ షుక్ నగర్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, మహేష్ ,శ్రీకాంత్, కొప్పుల దినేష్, యాదగిరి సురేందర్, లక్ష్మారెడ్డి, చిన్న తదితరులు పాల్గొన్నార

### గణపతిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన తడక జగదీశ్వర్ గుప్తా

**నేరేడ్‌మెట్, సెప్టెంబర్12 ప్రభాతవార్త:**



గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న తడక జగదీశ్వర్ గుప్తా..

గణపతిని భక్తి శ్రద్ధలతో పూజిస్తే సకల విజయాలు కలుగుతాయని వైయస్సార్ సీపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు తడక జగదీశ్వర్ గుప్తా తెలి పారు. మల్కాజిగిరి నియో జకవర్గ పరిధిలోని నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని శక్తినగర్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిని దర్శించుకొని ఆయన ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో గణపతి నవరాత్రుల, ప్రశాం తమైన వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసి యేషన్ సభ్యులు పాల్గొన్నారు. శ్రీ సాయినగర్ కాలనీ హౌసింగ్ సొసైటీలో.. వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయినగర్ కాలనీ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన గణపతికి కాలనీ ఉపాధ్యక్షులు ఆకుల ప్రభాకర్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుడికి పూజలు భక్తి శ్రద్ధలతో చేయాలన్నారు. కాలనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిని ఆకుల ప్రభా కర్ ఇప్పించడం జరిగిందని కాలనీ అధ్యక్షులు బుగ్గ ఉపేందర్, ప్రధాన కార్యదర్శి గ్యా రల రమేష్‌లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

### ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటాం: చైర్మన్ నర్సింహారావు

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అందరి బాధ్యత అని గ్రేటర్ ఈస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ టీ.నర్సింహారావు పేర్కొన్నారు. ఆర్కేపురంలోని అష్టలక్ష్మి దేవాలయము ప్రాంగణం నుండి గురువారం వరద బాధితులకు నిత్యవసర వస్తువులను తీసుకువెళ్లే డీసీఎం వాహనంను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అసోసియేషన్ నుండి దాదాపు రూ.20 లక్షల విలువచేసే నిత్యవసర వస్తువులు, బట్టలు, చిన్నారులకు ఆట వస్తువులను వరద బాధిత ప్రాంతాలకు అందించేందుకు తీసుకువెళ్లడం జరిగిందన్నారు. వెయ్యికిట్లను వరంగల్‌లోని ములుగు, ఖమ్మం, నల్గొండలోని ప్రాంతాలలోని బాధితులకు అందిస్తామని తెలిపారు. సమస్యల్లో ఉన్నవారికి తమ సంస్థ ద్వారా అండగా ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ ఈస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మారం సతీష్, వైస్‌ప్రెసిడెంట్ శ్యామ్‌కిరణ్, పాండురంగారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుధాకర్, విక్రంరెడ్డి, రవీంద్రకుమార్, ఉపేందర్, క్రెడాయి ఈసి మెంబర్‌మోరిశెట్టి శ్రీనివాస్, ఐత అంజయ్యగుప్తా, సామాజిక సేవకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, విక్రమ్, మేఘన, అక్షయ్, రతన్, వాసు, గౌరిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు: బొక్క మధుసూదన్ రెడ్డి

**మలక్ పేట ,సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** భారతదేశం గురించి, హిందువుల గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని మలక్ పేట బిజెపి నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ దేశం గురించి, హిందువులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి తెలంగాణ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు మలక్ పేట బిజెపి నాయకులు మూసారం బాగ్ చౌరస్తా వద్ద రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు బొక్క మధుసూదన్ రెడ్డి, సందడి సురేందర్ రెడ్డిలు మాట్లాడుతూ దేశం గురించి, హిందువుల గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ రెడ్డి, నరసింహ, గజానంద్ ,శ్రీకాంత్, చందు, ప్రదీప్, భరత్ ,శ్రీనివాస్, కిరణ్, పవన్ పాల్గొన్నారు.

## క్రీడలు ఆలోచన శక్తిని పెంపొందిస్తాయి



కార్యక్రమంలో పాల్గొన్న చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** నాగోల్ ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌జిఎఫ్ ఉప్పల్ జోనల్ లెవెల్ కబడ్డీ టోర్నమెంట్‌కి ముఖ్యఅతిథులుగా నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్, పర్యాటకశాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక ఎదుగుదల పాటు మంచి ఆలోచన శక్తిని పెంపొందిస్తుందని అన్నారు. పాఠశాలలో క్రీడా పోటీలు పెట్టకపోవడం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురి అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని అన్నారు. సమస్యలను అధిగమించాలంటే పిల్లలకు క్రీడలలో పాల్గొనే అలవాటు చేయాలన్నారు.పిల్లలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఎదిగేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడల వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులకు తెలియజేయాలన్నారు.

### డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీలకు ప్రాధాన్యత : మేయర్ పారిజాత



యుజిడి పనులు ప్రారంభించిన మేయర్ పారిజాత,పక్కన కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:**

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లలో సిసి రోడ్డు, డ్రైనేజీల నిర్మాణాలకు ప్రాధాన్యతనిచ్చామని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. కార్పొరేషన్‌లోని 24వ డివిజన్ ఎస్ఆర్ హిల్స్ కాలనీలో గురువారం భూగర్భ డ్రైనేజీ నిర్మాణపు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఆమె కాలనీవాసులతో కలిసి యుజిడి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశలవారీగా డివిజన్లలో అభివృద్ధి పనులు చేయిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి,రంజిత్‌రెడ్డి,కాలనీవాసులు పాల్గొన్నారు.

## డిఎస్ఎల్ మాల్‌లో ఎకో ప్రెండ్లీ గణపతి ఏర్పాటు

**ఉప్పల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని డిఎస్ఎల్ వర్చువల్ మాల్‌లో జనపనారతో తయారు చేసిన ఎకో ప్రెండ్లీ గణేశుడు ఆహుతులను ఎంతో ఆకట్టుకుంది. 6వేల నూనె దీపాలు, మట్టి, కొబ్బరి జనపనారతో ప్రత్యేకంగా పర్యావరణ అనుకూల గణపతిని ఏర్పాటు చేసినట్లు నిర్వహకులు తెలిపారు. సాంప్రదాయం, సంస్కృతి, సుస్థిరత కలయికతో డిఎస్ఎల్ వర్చువల్ మాల్‌లో 6వేల నూనె దీపాలు, సహజ మట్టి, కొబ్బరి జనపనార ఉపయోగించినట్లు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలు ఆనందోత్సవాలతో చేసుకునేందుకు తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని, సంస్కృతి, సాంప్రదాయాలను మరింత పెంచే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మాల్ నిర్వహకులు పాల్గొన్నారు.

### గుర్రంగూడ గణనాథులకు ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పూజలు



గణేష్ పూజలు నిర్వహించిన ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో ప్రతిష్టించిన వినాయకులకు చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు జరిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయక మండపాలను సందర్శించిన ఆయనను గుర్రంగూడ కురుమ సంఘం, నవ చైతన్య అసోసియేషన్, ఆదిత్యనగర్ అసోసియేషన్లకు చెందిన గణేష్ ఉత్సవ సమితిల వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో మహేశ్వరం బిజెపి ఇంఛార్జి చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, మాజీ పర్సన్ ఇంఛార్జి జక్కిడి జంగారెడ్డి, సీనియర్ నాయకులు జక్కిడి మధుసూదన్‌రెడ్డి, పోచయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

### చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులకు ప్రోత్సాహం: చైర్మన్ బీరప్ప

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** లార్డ్స్ పాఠశాలల విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నామని లార్డ్స్ విద్యా సంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపారు. ఈ నెల 14 నుండి 16 వరకు నిర్మల్ పట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు జిల్లెలగూడ లార్డ్స్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన సంపత్, సందీప్, సుశాంత్, సాయి, నితీష్, అక్షిత్ తదితరులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపి స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సిద్దాల శ్రీలత, ప్రధానోపాధ్యాయుడు మరియన్, పిఇటి లవకుమార్, మానస పాల్గొన్నారు.

## పూజలందుకుంటున్న గణనాథులు

**సైదాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:**



పూజలు నిర్వహిస్తున్న లింగాల హరిగౌడ్

గణపతి నవరాత్రుల సందర్భంగా లంబోదరుడు భక్తుల నిత్యపూజలం దుకుంటున్నాడు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని పలు గణనాథుడి మండపాలను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## భక్తుల పూజలందుకుంటున్న లంబోదరుడు

**సైదాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:**



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన పలు గణనాథుడి మండపాలను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి సందర్శించి లంబోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిమజ్జన సమయంలో పోలీసుల సూచనలు పాటించాలని సూచించారు.

## గణపతి పూజలో పాల్గొన్న డిసిపి

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:**



పూజా కార్యక్రమంలో పాల్గొన్న డిసిపి ప్రవీణ్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి

ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాగణపతి 37వ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎల్బీ నగర్ జోన్ డిసిపి ప్రవీణ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలోవాసవి కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ చిలుక ఉపేందర్‌రెడ్డి, వాసవికాలనీ అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్త, ప్రధానకార్యదర్శి ఐత అంజయ్యగుప్తా, కృష్ణయ్య, అష్టలక్ష్మి దేవాలయ అక్షయ ట్రస్ట్ సెక్రటరీ సుధాకర్‌గుప్తా, గంప జగన్, బంధం దామోదర్, గౌరిశెట్టి అరుణ్, గౌరీ శంకర్, వనమా సుదర్శన్, తమ్మన్న శ్రీధర్, మాలే అనిల్, ఒరుగంటి వెంకటేశ్వర్లు, గ్రంథి రమేష్, మంచుకొండ శ్రీనివాస్, సుబ్బారావు, జగిని శ్రీనివాస్, మేఘమాల, సుజాత, లక్ష్మీ, భ్రమరాంబా వనజ పాల్గొన్నారు.

### భక్తి శ్రద్ధలతో గణపతి పండుగ జరుపుకోవాలి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, సెప్టెంబర్ 12.ప్రభాతవార్త.**



వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

బి.ఎన్. రెడ్డి. నగర్ డివిజన్ లోని వివిధ కాలనీ లలో నిర్వాహకులు ఏర్పాటు చేసిన వినాయక మండపాలను డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సందర్శించి గణనాధుడికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి,కె.రవి శంకర్, పవన్ రెడ్డి, మురళి, శారద, శర్మ, రామేశ్వర్,సందీప్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజు గౌడ్,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.